ఎల్లెల్సీ రైతుకు తప్పని కష్టాలు !

- రూ.కోట్లు వెచ్చించినా నెరవేరని లక్ష్యం
- కొనసాగుతున్న కర్ణాటక జలచౌర్యం
- ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందని వైనం
- పంటసాగుపై మీమాంస


ఎమ్మిగనూరు సమీపంలో ఎల్లెల్సీలో తగ్గిన నీటిప్రవాహం


బీడు భూములుగా మారిన ఆయకట్టు పొలాలు

ఎమ్మిగనూరు: జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరుల్లో ముఖ్యమైనది తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ). వెనుకబడిన ఆదోని డివిజన్‌లోని ఆలూరు, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాలతో పాటు కోడుమూరు, కర్నూలు పరిసర ప్రాంతాలకు ఈ కాలువ నీరే శరణ్యం. తాగు, సాగునీటి అవసరాలను తీర్చుతూ మెట్ట రైతులకు మేలు చేకూర్చే ఎల్లెల్సీ ఏటేటా తన ప్రాభావాన్ని కోల్పోతుంది. ఆధునీకరణ పేరుతో ప్రభుత్వాలు నిధులు వరదలా పారించినా ఎల్లెల్సీలో నీళ్లు మాత్రం పెరగటం లేదు. ఒక్క ఎకరా కూడా అదనపు ఆయకట్టు సాగవ్వకపోగా ఏటేటా ఆయకట్టు విస్తీర్ణం మాత్రం కుదించుకుపోతోంది. తుంగభద్ర డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నా ఆయకట్టుకు మాత్రం అందటంలేదు.

జలచౌర్యంతో ఆంధ్రాకు తగ్గిన నీరు

తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీకి ప్రతిరోజు 1800క్యూసెక్కుల నీరు విడుదల కావాల్సి ఉండగా అంతకు ఎక్కగానే టీడీడ్యాం అధికారులు వదులుతున్నారు. కానీ కర్ణాటక ప్రాంతంలో తూములు, ఎస్కేప్ ఛానల్స్ తెరచి ఎల్లెల్సీ నీటిని అక్కడి చెరువుల్లో, వంకల్లో నిలువచేస్తున్నారు. ఫలితంగా ఆంధ్ర సరిహద్దులో మనకు 450 క్యూసెక్కులకుపైగా రావాల్సి ఉండగా 300 క్యూసెక్కులు కూడా రావటంలేదు. అదేవిధంగా ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ ప్రారంభం (చెన్నపురంవద్ద)లో 300 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా వారం రోజుల నుంచి 120 క్యూసెక్కులు కూడా రావటంలేదు. ఐఏబీ సమావేశం జరిగినా ప్రయోజనం లేకపోయింది. ఎన్ని ఎకరాలకు నీరిస్తారో.. ఏఏ పంటలు సాగుచేసుకోవాలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులే తేల్చక పోవటంతో రైతులు, స్థానిక అధికారులు అయోమయంలో పడ్డారు.

ఆయకట్టులో సగానికి కూడా అందని నీరు

తీవ్ర వర్షాభావ ప్రాంతంగా ముద్రపడిన ఆదోని డివిజన్ రైతులకు ఎల్లెల్సీ వరప్రసాదమైంది. 1948లో పూర్తయిన తుంగభద్ర డ్యాం కర్నూలు జిల్లాల రైతాంగం కోసం సాగునీటిని అందించేందుకు ఎల్లెల్సీ నిర్మాణం జరిగింది. 1953 నుంచి దిగువ కాలువకు సాగునీరు విడుదల చేసి ఆయకట్టుకు స్థిరీకరించారు. తుంగభద్ర దిగువ కాలువ ద్వారా కర్నూలు జిల్లాలో 1.5లక్షల ఎకరాలకు సాగునీరు అందాలి. ఖరీఫ్‌లో 43వేల ఎకరాలు, రబీలో 1.07 లక్షల ఎకరాలను స్థిరీకరించారు. కొన్నేళ్లుగా స్థిరీకరించిన ఆయకట్టులో సగభాగం కూడా సాగవ్వకపోవడం విచారకరం. ఈ ఏడు కూడా పాలకుల ప్రయత్నలోపం.. అధికారుల తీరు రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది.

ఏటేటా తగ్గుతున్న ఆయకట్టు

తుంగభద్ర దిగువ కాలువకు నిధులు వరదలా వస్తున్నా నీళ్లు మాత్రం రావడం లేదు. సాగునీటి గలగలతో కళకళలాడాల్సిన దిగువ కాలువలో బురదే దర్శనమిస్తోంది. వర్షాభావ పరిస్థితులు, విస్తరిస్తున్న అక్రమ ఆయకట్టు సాగు మూలంగా ఏటేటా ఎల్లెల్సీ ఆయకట్టు కుదించుకుపోతుంది. తుంగభద్ర దిగువ కాలువ కింద ఖరీఫ్‌లో 43 వేల ఎకరాలకు నీరు అందాల్సి ఉండగా ఇప్పటి వరకు ఎన్నెకరాలకు సాగునీరందిరో చెప్పే నాయకులు గానీ, అధికారులు గానీ లేరు. ప్రస్తుతం డ్యాంలో పుష్కలంగా నీరు ఉంది. గేట్లు ఎత్తి నదికి వదులుతున్నారే తప్పా ఆయకట్టుకు మాత్రం అందిచడం లేదు.

ఎల్లెల్సీలో తగ్గిపోయిన నీటి ప్రవాహం

గోనెగండ్ల : తుంగభద్ర దిగువ కాలువకు గోనెగండ్ల సెక్షన్ పరిధిలో నీటి ప్రవాహం శుక్రవారం 26 క్యూసెక్కులకు పడిపోయింది. ఎల్లెల్సీ ఏఈ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ గోనెగండ్ల సెక్షన్ దిగువ కాలువకు కేవలం 26 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తుంది. విడుదల అయిన నీటిలో వరినాట్లకు, ఎంఎల్ఎస్‌పీ కాలువకు 7 క్యూసెక్కులు, పొనకలదిన్నె కాలువకు 9 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని తెలిపారు. అలాగే తాగునీటి అవసరాలకు గోనెగండ్ల, అలువాల ఎస్ఎస్ ట్యాంకులకు విడుదల చేస్తున్నామని చెప్పారు. ఎగువ ప్రాంతంలో నీటి మట్టం పడిపోవడంతో కింద ఉన్న కాలువలకు ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.


గోనెగండ్ల సెక్షన్ దిగువ కాలువలో తగ్గిన నీరు

అయోమయంగా ఉంది



తుంగభద్రడ్యాంలో పుష్కలంగా నీరుంది. ఎల్లెల్సీకి నీరు వదులుతున్నారుగానీ ఆంధ్ర సరిహద్దుకు పూర్తిస్థాయి నీరు రావడంలేదు. కర్ణాటకలో తూములు, ఎస్కేప్ ఛానళ్లు తెరిచి వంకలు, చెరువులకు నీరు వాడుకొంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే అక్కడి డీసీ (జిల్లా కలెక్టర్) ఉత్తర్వులంటున్నారు. అంతా అయోమయంగా ఉంది. వారం రోజులుగా ఆంధ్ర సరిహద్దులో 300 క్యూసెక్కులు కూడా రావడం లేదు. ఏఏ పంటలకు నీరివ్వాలో, రైతులకు ఏమి సమాధానం చెప్పాలో అర్థంకావడం లేదు. డ్యాంలో నీరున్నాయి కాబట్టి నీరిస్తామని టీబీబోర్డు అధికారులు చెబుతున్నారేగానీ కిందికి మాత్రం నీరందడంలేదు. వారం, పదిరోజుల్లో మనవాటను పూర్తిస్థాయిలో ఇస్తామని డ్యాం అధికారులు, బోర్డు ఎస్ఈగారు హామి ఇచ్చారు.
– శైలేశ్వర్, ఎల్లెల్సీ ఈఈ

కుడికాలువ నిర్మాణం పూర్తిచేయాలి



ఎల్లెల్సీద్వారా సాగునీరు ప్రశ్నార్థకమైయింది. ప్రభుత్వాల వైఫల్యాలు రైతులకు శాపంగా మారుతున్నాయి. ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం పూర్తయితే పశ్చిమ ప్రాంత రైతులకు ఉపయోగకరమవుతుంది.
– వై. బాలనాగిరెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే

కర్ణాటక జలచౌర్యాన్ని అరికట్టాలి



తుంగభద్ర కాలువనీటిని ఎగువనున్న కర్ణాటక దోపిడి చేస్తోంది. తూములు, ఎస్కేప్ ఛానల్స్ తెరిచి అక్కడి రైతులు వంకలు, చెరువులు నింపుతున్నారు. ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో వర్షాభావంతో సాగు చేసి పంటలు ఎండుతున్నాయి. కర్ణాటక జలచౌర్యాన్ని అరికట్టి ఆయకట్టు భూములకు సాగునీరందించి పంటలను కాపాడాలి. అదే విధంగా గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయకట్టు చివరి భూములకు సాగునీరందించాలి.
– బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్

క్లుప్తంగా

హాకీలో పతకం సాధించడంపై హర్షం


ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: హాకీ క్రీడల్లో భారత పురుషుల జట్టు అద్భుతమైన ప్రదర్శనలో ప్రతిభ చాటిందని ఆదోని జోన్ ఉపాధ్యాయులు నరసయ్య, ఖలీల్ అహ్మద్, నరసింహులు తెలిపారు. శనివారం విశ్వక్రీడల్లో భాగంగా భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండవసారి కాంస్య పతకం సాధించడం పట్ల ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ క్రీడా మాంత్రికుడు ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని మన క్రీడాకారులు అద్భుతంగా ఆడినప్పటికీ బాంగారు పతకం చేజారి పోయినా ప్రజల హృదయాలను మాత్రం గెలుచుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు రామన్న, ఓబన్న, రమేష్, రవిబాబు, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు దూరంగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మంజునాథ్

మంత్రాలయం : గ్రామస్తులు కలిసిమెలసి జీవిస్తూ అల్లర్లకు దూరంగా ఉండాలని సీఐ మంజునాథ్ సూచించారు. శనివారం కోసిగి ఎస్ఐ కౌతాళం గ్రామంలో ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో అందరూ స్నేహితులుగా జీవనం సాగించాలన్నారు. అల్లర్లకు పాల్పడితే కుటుంబాలు నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దని సూచించారు. ఎవరైనా అక్రమ సారా, గుట్కా, మట్కా కార్యకలాపాలకు పూనుకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్ఐ నరేంద్రకుమార్, సర్పంచు పాల్‌దినకర్ తదితరులు ఉన్నారు.

మంగరాయుడికి వెన్న అలంకరణ


వెన్న అలంకారంలో మంగరాయ ఆంజనేయస్వామి


ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామివారికి శ్రావణమాసం సందర్భంగా మొదటి శనివారం స్వామివారిని వెన్నతో అలంకరించారు. ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆధ్వర్యంలో స్వామివారికి పూజారులు గురురాజ ఆచారి, అక్షయ్‌లు ఫల పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆరు కేజీల వెన్నతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు


బసలదొడ్డి పైరయ్య ఆంజనేయస్వామి

పెద్దకడబూరు: శ్రావణ మొదటి శనివారాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని తారాపురం గిడ్డాంజనేయస్వామికి, బసలదొడ్డి గ్రామంలో వెలసిన పైరయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బసలదొడ్డి గ్రామంలో ఆలయ అర్చకులు రామకృష్ణస్వామి తెల్లవారుజాము నుంచి స్వామి వారికి కుంకుమార్చన, పుష్పార్చన, పాలాభిషేకం, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతులు ఇచ్చారు. బసలదొడ్డి గ్రామంతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలు స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మసీదులో ప్రార్థన చేస్తూ వృద్ధుడి మృతి


మృతి చెందిన గౌస్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సున్నంబట్టీల పెద్ద కమేళ ప్రాంతంలోని సైఫ్ సర్వీ మసీద్‌లో శనివారం 11 గంటల ప్రాంతంలో ఆదే ప్రాంతానికి చెందిన గౌస్(75) ప్రార్థన చేస్తూ గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. మధ్యాహ్నం నమాజ్ చేసేందుకు వెళ్లిన ముస్లింలు కిందపడి ఉండటం చూసి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం


జెండావిష్కరణలో యూటీఎఫ్ నాయకులు

నందవరం: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ నిరంతర పోరాటాలు సాగించిందని సంఘం జిల్లా అధ్యక్షుడు దావీదు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లప్ప, జిల్లా కార్యదర్శి దేవపాల్ అన్నారు. యూటీఎఫ్ ఏర్పాటు చేసి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శనివారం ముగతి సర్కిల్‌లో జెండావిష్కరణ చేశారు. వారు మాట్లాడుతూ విద్యారంగంలో జీవో 117, సీపీఎస్ విధానం రద్దు కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేవసహాయం, అబ్దుల్ రహమాన్, ఆంజనేయులు, మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రాముడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణ పురపాలక ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ వేడుకలను యూటీఎఫ్ జిల్లా సహఅధ్యక్షురాలు జీవిత అధ్యక్షతన శనివారం ఘనంగా జరుపుకున్నారు. యూటీఎఫ్ సీనియర్ నాయకురాలు వాణికుమారి యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు విరుపాక్షి, కృష్ణమూర్తి, పాపయ్య, ఫయాజ్, రాణికుముదిని దేవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం

గోనెగండ్ల: ఉపాధ్యాయుల సమస్యలపై, విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటలు చేస్తూ ఎన్నో విజయాలు సాధించిన సంఘం యూటీఎఫ్ సంఘం అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యస్.నాగమణి అన్నారు. యూటీఎఫ్ 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శనివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో స్వర్ణోత్సవ పతాకాన్ని సీనియర్ నాయకుడు బీజీ మాదన్న ఆవిష్కరించారు. అనంతరం స్వర్ణోత్సవ క్రీడా సంబరాలలో భాగంగా వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచులను వైద్యుడు డాక్టర్ జి. మాలకొండయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్ దావీదు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జె.ఎల్లప్ప, నాయకులు దేవపాల్, కొలన్న, రామాంజినేయులు, రాఘవేంద్ర, మాల్లారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కొవ్వొత్తులతో నిరసన

ఎమ్మిగనూరుటౌన్: బెజవాడలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పంపై పచ్చ కూటమి నాయకులు చేసిన దాడికి నిరసనగా శనివారం రాత్రి పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ పచ్చమూకలు రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచారన్నారు. బడుగుల నేత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పాన్ని రూ.404 కోట్లతో ఏర్పాటు చేసి, ఒక జిల్లాకు అంబేడ్కర్ పేరు పెట్టిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. దీనిని జీర్ణించుకోలేని సీఎం చంద్రబాబునాయుడు మహాశిల్పం వద్ద రాత్రి వేళ లైట్లు ఆర్పి మరీ శిలాఫలకంపై అక్షరాలను తొలగించి దుర్మార్గాన్ని తెరలేపారని ఆరోపించారు. రాజ్యాంగ నేత విగ్రహంపై దాడి చేసేందుకు టీడీపీ కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు వాహిద్, నాగేషప్ప, మహబుబ్‌బేగ్, కోటకొండ నరసింహులు, సోమేష్, సయ్యద్‌చాంద్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్ ప్రయాణికులకు మదద్

- సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక యాప్
- తక్షణ పరిష్కారానికి చర్యలు



రైల్ మదద్ యాప్

ఆదోని సెంట్రల్: రైల్లో ప్రయాణించే వారికి ఎదైనా సమస్య వచ్చినపుడు వెంటనే ఫిర్యాదు చేసేందుకు రైల్ మదద్ యాప్‌ను రైల్వే శాఖ ప్రవేశపెట్టింది. ప్రయాణికుల భద్రతకు సంబంధించి వివిధ రకాల సేవల నిమిత్తం టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకొని వచ్చింది. ప్రయాణికుల విషయంలో మరింత జవాబుదారీ తనంగా వ్యవహరించేందుకు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా ఈ యాప్‌లో స్టేషన్లో అపరిశుభ్రత, రైల్లో భద్రత, సిబ్బంది నిర్లక్ష్యం ఇలా 35 రకాల సమస్యలపై ఫొటోలు అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరిస్తారు. అయితే ఫిర్యాదు చేసే వ్యక్తి రిజర్వేషన్ లేదా జనరల్, ప్లాట్‌ఫాం టికెట్లలో ఎదో ఒకటి కలిగి ఉండాలి. అప్పుడే సమస్యలపై ఈ యాప్‌లో ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉంది.

ఫిర్యాదులు చేయాల్సినవి

రైల్వే స్టేషన్లలో అపరిశుభ్రత వాతవరణం, రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ జాబితాలో ఉండడం, నీటి కొరత, వెయిటింగ్ హాల్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడం, రైలు సిబ్బంది నిర్లక్ష్యం, టీటీఈ ఇతర సిబ్బంది అవినీతి, దురుసు ప్రవర్తన, అనుమానస్పద వ్యక్తుల కదలికలు, గొలుసు దొంగతనాలు, వస్తువుల అపహరణ, మద్యం సేవించడం, కొట్లాటలు, పొగ, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన కలిగి ఉండడం, భోగీల్లో అపరిశుభ్రత, ఆకతాయిల వేధింపులు, మరుగుదొడ్లు, ఏసీ, ఫ్యాన్లు, లైట్లు, నాణ్యత లేని ఆహారం, అధిక ధరలకు తిను బండారాలు అమ్మడం, బెడ్ రోల్స్ అపరిశుభ్రంగా ఉండడం, చార్జింగ్ పాయింట్ల్ పనిచేయకపోవడం, రైలు రాకపోకల్లో ఆలస్యం వంటి తదితర సమస్యలపై ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చును.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

రైల్లో ప్రయాణించే ప్రయాణికులు ముందుగా ప్లేస్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. ఈ యాప్‌లో వ్యక్తిగత వివరాలు, సెల్‌ఫోన్, ఈ-మెయిల్ తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. మీ సెల్‌ఫోనుకు వచ్చిన ఓటీపీని నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ యాప్ ద్వారా సంబంధిత అధికారులకు సూచనలు సలహాలను అందించవచ్చు. యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన సమస్య పరిష్కారం కాగానే ఎస్ఎంఎస్ లేదా ఈ- మెయిల్ ద్వారా సమాచారం అందిస్తారు.

రేపటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

కోసిగి: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు పునశ్చరణ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హారూన్ రషీద్ తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమష్టి గ్రామాల్లో చేపట్టే పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, తాగునీటి సరఫరా విధానంపై మండల విస్తరణ అధికారిచే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. తద్వారా కోసిగి మండలంలోని 24 గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యాదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

పాముకాటుతో ఇద్దరికి అస్వస్థత

ఆదోని అర్బన్: డివిజన్ పరిధిలోని వేర్వేరు గ్రామాల్లో శనివారం పాముకాటు గురైన ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. హొళగుంద మండలం నెరణికితండా గ్రామానికి చెందిన బాలుడు మునిస్వామి ఇంట్లో ఆడుకుంటుండగా పాముకాటు వేసింది. అదేవిధంగా కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి పొలంలో పనులు చేస్తుండగా పాముకాటుకు గురై అస్వస్థతకు గురైంది. వెంటనే వారి బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి


గాయపడిన లక్ష్మన్న

ఆదోని అర్బన్: మా ప్రభుత్వం వచ్చింది.. నీ అంతు చూస్తామని టీడీపీ నాయకులు బంగారప్ప, సోమేష్ అలియాస్ శివ వైఎస్సార్‌సీపీ నాయకుడు సారక్కగారి పెద్ద లక్ష్మన్నపై శనివారం దాడి చేశారు. బాధితుడు ఆదోని రూరల్ పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు.. అలసందగుత్తి గ్రామానికి చెందిన లక్ష్మన్న తంగరడోణ గ్రామంలోని చింతలాముని, నల్లారెడ్డి స్వామివార్ల సన్నిధిలో పూజలు ముగించుకుని వస్తుండగా టీడీపీ వర్గీయులు అలసందగుత్తి సమీపంలో ఎలాంటి కారణం లేకుండానే నీ అంతుచూస్తామంటూ దాడి చేశారు. దీంతో బాధితుడికి గాయాలయ్యాయి. వెంటనే గాయాలపాలైన పెద్ద లక్ష్మన్నను బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడు ఆదోని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు



గాయపడిన నాగార్జున, సోడా బండి శ్రీనివాసరావు

ఆదోని అర్బన్: పట్టణంలోని పాత ఓవర్ బ్రిడ్జి కింద పెద్ద పోస్టాఫీసు సమీపంలో శనివారం సోడా సీసాలతో ఒకరినొకరు కొట్టుకున్న ఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. టూటౌన్ పోలీసులకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. ఆదోని మండలం దిబ్బనకల్ గ్రామంలో విద్యుత్‌శాఖలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న నాగార్జున ఓవర్ బ్రిడ్జి కింద మోటార్ తెచ్చుకునేందుకు కారులో వెళ్లాడు. అడ్డంగా సోడా బండి ఉండడంతో హారన్ కొట్టాడు. అయినా బండి తీయకపోవడంతో సోడా బండి నిర్వాహకుడు శ్రీనివాసరావును నిలదీశాడు. నాగార్జున, శ్రీనివాసరావు మధ్య మాటా మాటా పెరిగి గొడవకు దారితీసింది. వెంటనే శ్రీనివాసరావు నాగార్జున తలపై కొట్టగా.. నాగార్జున కూడా ఆవేశం తట్టుకోలేక సోడా సీసాతో శ్రీనివాసరావుపై దాడి చేశాడు. ఘటనపై విచారణ చేపడుతున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణంలోని కొత్త ఓవర్‌బ్రిడ్జి సమీపంలో నిలబడి ఉన్న ఆటోను వెనుక నుంచి మరో ఆటో ఢీకొనడంతో మదిరె గ్రామానికి చెందిన వృద్ధుడు చంద్రన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన చంద్రన్నను వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బంధువులు పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం పని నిమిత్తం చంద్రన్న ఆటోలో వెనుక డోరుపై కూర్చొని మదిరె గ్రామం నుంచి ఆదోనికి వస్తుండగా కొత్త బ్రిడ్జి సమీపంలో మందు కారు నిలబడి ఉండడంతో ఆటో కూడా నిలిపారు. అదేసమయంలో వెనుక వస్తున్న ఆటో ఢీకొనడంతో చంద్రన్న కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. వెంటనే ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా శ్రావణమాస మొదటి శనివారం పూజలు


ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు


దర్శనానికి కొండ ఎక్కుతున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో శ్రీ రణమండల ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణశివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామి వారికి మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకుడు టి.జి.పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీ, వడలహారం, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అదేవిధంగా అన్నదానం నిర్వహించారు.

గుంటికంటి రంగస్వామికి తుంగా జలంతో అభిషేకం


తుంగభద్ర జలాలతో ఆలయానికి ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు



ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వెంకటాపురం కాలనీ సుభిక్షంగా వుండాలన్న సంకల్పంతో గ్రామస్తులు తుంగభద్ర నదికి వెళ్లి నదీ జలాలను తీసుకొచ్చి గ్రామంలోని గుంటి రంగస్వామికి జలాభిషేకం చేశారు. ఏటా శ్రావణ మాసం మొదటి శనివారం గుంటి రంగస్వామికి కాలనీవాసులు తుంగా జలాలతో అభిషేకం చేయనం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా వందలాది మంది 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుంగభద్ర నది వద్దకు కాలినడకన వెళ్లి జలాలను తీసుకొని గోవింద నామస్మరణతో ఊరేగింపుగా వచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బజారి, మాజీ కౌన్సిలర్ బాస్కర్ రెడ్డితో పాటు వార్డు పెద్దలు పాల్గొన్నారు.